

# మరో మయసభ

గుత్తుల భాస్కరరావు

'ఈ చుట్టుపక్కలకి బులిరామయ్యగారే-దుర్యోధనుడు'

ఇలా ప్రారంభిస్తే చాలామందికి గందరగోళంగా వుంటుంది. విషయం ఏవిటంటే—

ఆ రోజుల్లో బులిరామయ్యగారు 'మయసభ' ఏకపాత్రాభినయాన్ని-నమిలారనండి- మింగారనండి-ఆపోశన పట్టారనండి-ఏమైనా అనండి. మొత్తానికి మాస్టర్ చేసారని చెప్పొచ్చు. దుర్యోధన పాత్రని కాచివడబోసారు. మా ప్రాంతంలో షుమారుగా రెండు వందల ప్రదర్శనలిచ్చి సెహభాస్ అనిపించుకున్నారు. దుర్యోధనుడంటే తనే అని ముద్రవేయించుకున్నారు.

ఆరడుగుల భారీ విగ్రహంతో విశాలమైన ఛాతీతో మగసిరి నిండిన బాహువల్లరితో స్ఫురద్రూపంతో ఆయన

స్టేజీకి మకుటాయమానంగా నిలబడేసరికి జనం జేజేలు కొట్టేవారు. ప్రత్యేకంగా కుట్టించిన రాజదుస్తుల్లో దుర్యోధనుడు యిలాగే వుండేవాడేమో- అనిపించేవారు.

ఏకపాత్రాభినయం- ఒక గంట ప్రోగ్రాం.

ఆ గంటలో తనూ తెరలూ తప్ప ఏ హంగు ఆర్భాటంలేని స్టేజిమీద బులి రామయ్యగారి విశ్వరూపం చూడాలి. ఆయన విజృంభణ చూడాలి. అడ్డూ ఆపూ లేక జలపాతంలా దూకే సుదీర్ఘ సమాసాల సంభాషణలు వినాలి. సందర్భాన్ని బట్టి ప్రదర్శించే హావభావభంగిమలు... సంభాషణల మధ్య విరుపులు.. పాటించే అందమైన విరామాలు గమనించాలి.

అద్భుతంగా వుండే దా అనుభవం.

దుర్యోధనుడు మయసభలో ప్రవేశించి... రమణీయ ఉద్యానవనాలు సభాసౌందర్యం తిలకించి మయుని శిల్ప రచనా చమత్కృతికి అబ్బురపడ్డం- ఆనందించడం- అభినందించడం- అంతలోనే ఈర్ష్యపడ్డం- తీరా అసూయ మొలకెత్తాక అక్కడ నిలవలేకపోవడం- చక్కగా నటించేవారు.

సుయోధనుడు శిల్పాన్ని చూసి చిన్న దనుకున్న సందర్భంలో శిల్పానికి ప్రశ్నలు గుప్పించి జవాబురాక అటు యిటు చూసి స్పృశించి భంగపడే ఘట్టం మరుపురానిది.

సభలో ద్వారంలేని చోటు ఉన్నట్టు వుంటుంది. ద్వారం ఉన్నచోట దూసుకుని వెళ్ళబోతే... తపీమని గుద్దుకుని తలకి బొప్పి కడుతుంది. దిగ్భ్రమలో ప్రేక్షకులు కూడా నొసళ్ళు తడుముకునేవారు. సరోవరం లేనిచోట ఉన్నదనుకోడం- లేనిచోట దాన్లోపడి తడిసిపోడం కూడా ముఖ్యమైన ఘట్టం.


తన పరిస్థితి చూసి పాంచాలి పరిహసించిందని దుగ్ధ వెళ్ళగక్కిన సన్నివేశం మయసభకి మణిపూస అని చెప్పొచ్చు.

మయుని సృష్టిమాట అటుంచితే- బులిరామయ్య గారు తను మాయలో పడినట్టు నటించి ప్రేక్షకుల కళ్ళముందు మయసభ సృష్టించి భ్రమలో ముంచే సృజన గొప్పది.

అందుకే ఆయన దుర్యోధనుడని మారు పలికించుకున్నాడు.

మాటమాటకీ ప్రతి మూమెంటుకి చప్పట్లు కురిసేవి- అభినయం పూర్త య్యాక పూలమాలలు ఆయన్ని ముంచెత్తేవి.

నిజజీవితంలో బులిరామయ్యగారు దుర్యోధనుడి ముద్ర తప్పించుకోలేకపోయారు. చూపరులకి మహా గర్వపోతులా అవుపించేవారు. సుయోధనుడిలా అభిమానధనులు కూడా దర్జాగా ఠీవిగా కనిపించేవారు. పెద్ద పెద్ద అంగలతో నడవడం...... గంభీరంగా మాట్లాడ్డం... పెంచుకున్న కోరమీసం మాటిమాటికీ దువ్వుకోవడం లాంటి




పౌరాణిక చేష్టలు చేసేవారు. ప్రతిదానికీ పౌరుషపడేవారు. వాగ్వివాదాల్లో తరచూ ఛాలెంజీలు విసిరేవారు. నటనలో తనని మించినవారు లేరనే భావం ఎంత కాదనుకున్నా కనిపించేది ఆయన మొహంలో.

"తమరు కురుక్షేత్రం ఆడితే కనక వర్షం కురుస్తుంది. ఎత్తుకోకూడదూ ?" అని మెచ్చుకోలుగా అడిగితే—

ఒక ఛీత్కారం చేసి "వెధవది. సరైన కాంబినేషన్ కృష్ణులు, సమవుజ్జీ అర్జునులు లేరయ్యా. అంతా సజ్జుగాళ్ళు! అందుకే మయసభ తప్ప మరోటి ముట్టుకోను" అన్నారు.

ఈ మాటే లోకల్ కృష్ణులు అర్జునుల దగ్గర కదిపితే వాళ్ళు గేలిచేసారు. "సినిమా మూసలో గరంమసాలా సమాసాలు పలకడం కాదు. ముందావాణ్ణి రమ్మనండి. మాతో పోటీగా రాగం పట్టమనండి రంగు తేలుతుంది."

* * *

కొన్నేళ్ళు గడిచాయి.

జనవాక్యం మారింది.

"కాశీపతే ఈ చుట్టుపక్కలకి దుర్యోధనుడు."

ఇపుడు కాశీపతి మయసభ ఏకపాత్రాభినయంలో దిట్ట. కాశీపతి నటకౌశల్యమో - బులిరామయ్యగారి నటన క్షీణించిందో—గాలివాటుకి ప్రజల అభిరుచి మళ్ళిందో గానీ—

ప్రస్తుతం కాశీపతి దుర్యోధనుడిగా మార్మోగిపోతున్నాడు.

బులిరామయ్యగారు మాసిపోడానికి కాశీపతి మెరిసిపోడానికి మధ్య—మధ్య కాలంలో ఏం జరిగిందంటే...

ఛాలెంజీ మనస్తత్వంతో ఆయన విఱ్రవీగేవారని ముందే మనవిచేసా.

ఓ చల్లటి సాయంత్రం... మిత్రులు అభిమానుల సమక్షంలో 'మయసభ' గురించి ముచ్చటిస్తూ... బులిరామయ్య గారు రెచ్చిపోయారు. మీసం తిప్పి తొడకొట్టి... "ఈ జిల్లాలో ఎవడైనా సరే మయసభ. ఛాలెంజి! చూస్కోండి. ప్రచారం చేస్కోండి. గెల్చినవాడికి వెయ్యినూట పదహార్లు బహుమతి యిస్తా" అన్నారు.

దానితో కలకలం ప్రారంభమయింది.

కాస్సేపటికి సద్దుమణిగింది. అంతా ముక్కుమీద వేలుంచుకుని మౌనం పాటించారు.

కానీ ఓ లేత కంఠం ధైర్యంచేసి "గురువుగారూ" అంది.

"ఏం, నువ్వు పోటీచేస్తావా?" అన్నారాయన. అంతా అటు తిరిగి ఘొల్లున నవ్వారు.

"పోటీగా కాదు. తమరు అనుమతిస్తే తమ సమక్షంలో ఒకసారి నటించి చూపిస్తా" అన్నాడు సవినయంగా.

అతనెవరో కాదు. ప్రతి ప్రదర్శనకీ బులిరామయ్యగారి వెంట నీడలా తిరిగే వాడు, పేరు కాశీపతి.

అంతవరకూ ఏ ప్రత్యేకతా లేని వాడు. అడపాతడపా 'హార్మణీ' తొక్కే వాడు. దుస్తుల పెట్టెలు మోసేవాడు. కర్టెన్లు లాగేవాడు. బులిరామయ్యగారు రంగులుపూసుకోడానికి కడుక్కోడానికి సాయపడేవాడు. ప్రదర్శనకి ముందు పబ్లిసిటీకోసం ఊళ్ళోపడి మైకులో అరిచేవాడు.

అలాంటివాడు ఉన్నట్టుండి సుయోధనుడయ్యాడు.

మిగతావాళ్ళవంక వేళాకోళంగా చూసి... "సరేకానియ్" అన్నారు బులిరామయ్యగారు. కాశీపతికి గురువుగారి ఆమోదం లభించింది. చాటుగా కొందరు కాశీపతిని ఎగదోసారు "ఛాలెంజీగా వెయ్యి. గెలిస్తే వెయ్యినూట పదార్లు దక్కేను" అని. అతను ఒప్పుకోలేదు. కేవలం గురువుగారి ఆశీర్వాదంతోనే నటించి చూపిస్తానన్నాడు.

తీరా ఒప్పుకున్నారే గానీ బులిరామయ్యగారి గుండెల్లో గుబులు ప్రారంభమయింది. కాశీపతి మయసభ నటించడం ఆయనకిష్టంలేదు... ఏమో. యిలాంటివాళ్ళే మెరుపుల్లేని పిడుగులు!

వారం తర్వాత—

హైస్కూలు ఆవరణలో ప్రదర్శన ఏర్పాటయింది.

జనం కిటకిటలాడారు.

యిది బులిరామయ్యగారి శిష్యుడి ప్రదర్శన అనీ... ఆయనతో పోటీ కాకపోయినా... పోటీస్థాయిలో జరుగుతుందనీ...ఆ నోటా ఈ నోటా ప్రదర్శనకి ప్రచారం దక్కింది.

బులిరామయ్యగారు పురప్రముఖుల మధ్య ముందు వరసలో కూర్చున్నారు.

ఎదురుగా రకరకాల అలంకరణలతో సిల్కు తెరలతో ముసుగు ధరించిన ముగ్ధలావుంది వేదిక.

ప్రదర్శన ప్రారంభమయింది.

వెలుగు వెల్లువలో తెర తొలగింది.

దుర్యోధనుడి రంగప్రవేశం!

బులిరామయ్యగారి గుండెలు ఝల్లుమన్నాయి.

కాశీపతి— కొత్త సుయోధనుడు కొదమసింగంలా అడుగులు వేస్తూ భుజాలు పొంగించి ధగధగ మెరిసిపోతున్నాడు.

గురువుగారివి రెండువందల ప్రదర్శనలు చూసాడేమో మెళకువలు ఆకళింపు చేసుకున్నాడు. ఆద్యంతం సంభాషణలు ఆయన్నుంచే గ్రహించాడు.

కానీ తన గొంతుతో పలికాడు.

తన అడుగులు వేసాడు.

నటనలో తనదంటూ కొత్త ఒరవడి సృష్టించి మధ్యలో చెడకుండా నడిపి నిలిపాడు. ఏదో ప్రత్యేకత సాధించాడు.

కాశీపతి మయసభని వర్ణించడం నా తరంకాదు. కానీ అది జరుగుతున్నంత సేపూ రేపిన దుమారం విన్నవించగలను

భూకంపమొచ్చి భవంతులు కూలిపోయినట్టు ప్రేక్షకుల హృదయాల్లో బులిరామయ్యగారి రూపం తుడుచు పెట్టుకుపోయింది.

భూకంపం తర్వాత రెట్టింపు ప్రగతి సాధించిన చురుకు దేశంలా కాశీపతికి గొప్పపేరు దక్కింది.

మయసభ జరుగుతూంటే— పక్కన బులిరామయ్యగారి ఉనికి మర్చిపోయిన పురప్రముఖులున్నారు. అలాగే— వేదిక మీద కాశీపతిని, ఆయన్ని మార్చి పోల్చి చూసి నవ్వుకునేవాళ్ళూ వున్నారు.

వీళ్ళందరిమధ్య బులిరామయ్యగారికి తల తిరిగిపోయింది. ఒళ్ళంతా స్వేద బిందువులు పొటమరించాయి. యింత కంటే వేరే అవమానం లేదనిపించింది. ఆపైన ఒక్కక్షణం కూర్చున్నానిప్పుల మీదే అనిపించింది. అసహనంగా విసురుగా లేచారు.

ఎవరూ పట్టించుకోలేదు

**అంతా ప్రదర్శనలో లీనమైపోయారు.**

కాశీపతిని దుర్యోదనుడు ఆవహించాడు

బులిరామయ్యగారు చరచరా నడిచారు దెబ్బతిన్న దుర్యోధనుడిలా.

ఆయన దూరంగావెళ్ళి వెనక్కి తిరిగి చూస్తే...

అదంతా మరో మయసభలా తోచింది.